
# బంధం



— రావినూతల సువర్ణాకన్నన్

మధ్యాన్నం పన్నెండు గంటలయింది. ఒక్క సారిగా ఆకాశాన్నిండా కారుమేఘాలు కమ్మి నలు మూలలా చీకట్లావరించి వర్షం మొదలయింది. అది క్రమేపి పెరిగి కుంభవృష్టిలా మారింది.

వర్షం! ఎడతెరిపిలేని వర్షం! ఆకాశానికి చిల్లు పడినట్టు కుండపోతగా కురుస్తోంది వర్షం! ఆ వర్షంలో తలుపులన్నీ బిగించుకుని హాల్లో కూర్చుని, కాఫీలు తాగుతూ, నవ్వుతూ తృళ్ళుతూ కబుర్లు చెప్పుకుంటూ ప్లేయింగ్‌కార్డ్సు ఆడుకుంటున్నారు ఆ ఇంట్లోవారంతా.

ఆ రోజు ఆదివారం కావడం అందర్కీ ఇంటి పట్టునే వుండడాన చాలా హేపీగా వున్నారంతా.

ఒక్క వందన మాత్రం తన గదిలో వంటరిగా కూర్చుని శూన్యంలోకి చూస్తోంది.

వందన ఆ ఇంటి చిన్నకోడలు. ప్రముఖ చిత్రకారిణి. ఆమె పేదింట పుట్టినా ఆమె అందచందాలు, సంస్కారం చూసిన ఈశ్వర్ కోరి కోరి చేసుకున్నాడు. అరచేతిలో నిమ్మపండులా అపురపంగా చూసు కుంటున్నాడు.

కానీ విధి ఓర్వలేకపోయింది. యాక్సిడెంట్‌లో అతన్ని పైలోకాలకి పంపి పాతికేళ్ళ వందన నుదుటి కుంకుమ చెరిపేసింది.

ఏడుపులూ పరామర్శలూ అయ్యాక వందన తల్లిదండ్రులామెని తీసికెళ్ళిపోతామన్నారు. అయితే అందుకు వందన అంగీకరించలేదు. తనూ, తన భర్త ఎంతో అన్యోన్యంగా మసలిన ఆ ఇంటినొదిలి పోవాలనిపించలేదామెకి. వందన సంపాదనని దృష్టిలో వుంచుకుని కొడల్నే సమర్థించారు.

అయితే వాళ్ళ ఆశ ఫలించలేదు. క్షణాల్లో చిత్రాలు గీసే వందన చిత్రలేఖనాన్ని పూర్తిగా మర్చి పోయింది. నెల తర్వాత అత్తగారు ఆమెముందు పేపర్లు కుంచెలు వగైరాలన్నీ పడేసి

"మునపటిలా చిత్రలేఖనం చెయ్యి నీ చిత్రాలకి ఫారెన్ కంట్రీస్‌లో కూడా మంచి డిమేండ్ వుంది" అంటూ సున్నితంగా చెప్పింది. అయినా వందన కుంచె పట్టలేదు.

నిద్రాహారాలు మానేసి శూన్యంలోకి చూస్తూ, కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూ గడిపింది. భోజనానికి తప్ప ఆమె గది ఒదిలిరాదు. కలవారే కాబట్టి ఆమె పన్లు చెయ్యక్కర్లేదు.

భర్తపోయి రెండునెలలైనా ఆమె తేరుకోలేదు. కుంచె పట్టాలన్న ప్రయత్నం కూడా చెయ్యలేదు.

మండిపడింది అత్తగారు "నువ్వేదో బొమ్మలు గీసి సంపాయిస్తావని నిన్నుండమన్నాను వూరికే కూర్చో బెట్టి మేపడానికి ఇక్కడ నీ బాబు ఇచ్చిన ఎస్టేట్లేం లేవు. వేస్తే బొమ్మలు వెయ్యి లేకపోతే నీదారి నువ్వు చూసుకో" అంది.

అదేమాట మరోరకంగా మామగారన్నారు. బావగారు ఆకలి చూపులు చూస్తూ ఆమెని సమర్థించేవాడెప్పుడైనా. అది గమనించిన తోటి కోడలు ఇన్ని పతివ్రతల పుస్తకాలు తెచ్చి ఆమెముందు పడేసి—

"రాత్రులు ఇవన్నీ చదువుకో పిచ్చి పిచ్చి ఆలోచనలు రావు" అని సలహా ఇచ్చింది.

ఎవరెన్ని చెప్పినా ఆమె పులకలేదు. చిత్ర లేఖనం చేద్దామని ప్రయత్నించినా ఆమెకి సాధ్యం కాలేదు. ఆమె మనసంతా భర్తమీదే!

పెద్దగా వురిమింది ఆకాశం. హాల్లో పేకాడుతున్న వాళ్ళు గదిలో కూర్చుని శూన్యంలోకి చూస్తున్న వందనా తృళ్ళిపడ్డారు.

ఓసారి తలెత్తి గదంతా కలయచూసింది వందన. "భర్త, తను కలిసి ఒక్కటైందిక్కడే భవిష్యత్తుని గురించి తియ్యని కలలు కన్నదా గదిలోనే ఎన్నో మధురానుభూతుల్ని వూహాగానాలు చేసిందీ గోడల మధ్యనే!

ఈ గది గోడలు ఈ మంచపుకోళ్ళు మెత్తని పరుపు ఇవన్నీ తమ ఆనందపు సంసారానికి ప్రత్యక్ష సాక్షులు! ఇపుడివన్నీ ఒంటరిగా వున్న తనని చూసి కన్నీరు కారుస్తున్నట్టునిపించిందామెకి.

పట్టుమని సంవత్సరమైనా గడవని తన సంసార గీతానికి చరమదశ వచ్చింది. ఇంక ముందు జీవిత మంతా మోడుగా బతకాల్సిందే. కానీ తన భర్త లేకుండా బతగ్గలదా?

హాల్లోంచి నవ్వులు అలలు అలలుగా వినిపిస్తు న్నాయి కన్నబిడ్డని పొగొట్టుకున్న ఆ తల్లిదండ్రులు, అన్నగారు రెండు నెలలు కూడా కాందే తమ బిడ్డనెలా మర్చిపోగలిగారు! అంత హాయిగా ఎలా నవ్వుకోగలుగుతున్నారు వాళ్ళలా నేనూ మర్చిపోతే ఎంత బావుండు అనుకుంది అలా ఆలోచిస్తూ ఎంతసేపుందో బావగారి కూతురు పిలుపుతో ఈ లోకంలోకొచ్చింది వందన.

అప్పుడు రాత్రి ఏడుగంటలయింది "బామ్మ అన్నానికి రమ్మంటోంది" అని వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోతున్న ఆ పిల్ల చెయ్యి పట్టుకుంది వందన. ఆ అయిదేళ్ళ పిల్ల తన చేతిలోని పుస్తకం పడేసి వందన చేతిని వదిలించుకుని వెళ్ళిపోయింది. ఒణుకుతున్న చేతులతో కిందపడిన పుస్తకాన్ని తీసి చూసింది వందన కవర్ పేజీమీద మేటర్ చూడ గానే ఆమె కళ్ళు విశాలమయ్యాయి.

అపుడే అత్తగారు ఒక్కకేక పెట్టింది. గభాల్ని పుస్తకాన్ని దిండుకింద పెట్టి డైనింగ్ హాల్లో కెళ్ళింది వందన.

"మహారాణిగారిని ఎన్నిసార్లు పిలవాలి!" అరచి నట్లు అంది అత్తగారు "పాపం! ఇక్కడికి రావడం కష్టంగా వుందేమో అక్కడికే తీసికెళ్ళేపోలా!" అంది తోటి కోడలు వ్యంగ్యంగా. బావగారు ఓ చూపు విసిరాడు. ఆ చూపులో అంతులేని ఆకలి.

"ఇదిగో చూడు! నీ అందచందాలూ, వయ్యారాలు చూసి చేసుకున్నవాడు పోనే పోయాడు. నేను నిన్ను కోడలిగా చేసుకున్నది నీ సంపాదనకోసం! మును పటికన్నా బాగా గియ్యాలి· అలా అయితేనే ఇక్క డుండు లేకపోతే నీదార్ని నువ్వుపో" అంటూ మళ్ళీ ఓ వార్నింగ్ ఇచ్చింది అత్తగారు.

ఈశ్వర్‌మీద వందనకున్న ప్రేమాభిమానాలు ఆమెకి తెలియనివికావు. ఎన్నన్నా ఆమె ఇల్లొదిలి పోదని ఆవిడకి తెలుసు.

"అలాగే అన్నట్లు తలూపి తన గదిలోకొచ్చి పడింది వందన·అత్తగారికోసమైనా చిత్రాలు గియ్యాలని ఒకప్పుడు చూసింది కానీ సాధ్యంకాలేదు. అందుకే గియ్యడం మానుకుంది.



గదిలోకొచ్చీరాగానే దిండుకింద దాచిన పుస్తకం తీసి చదవాలనుకుని తలుపులు వేసి గడియ పెట్టింది.

ఒణుకుతున్న చేతులతో దిండుకింది పత్రికని తీసింది. ఆమె చేతులు మెల్లగా పేజీలు తిప్పు తున్నాయి. గుండె ఎందుకో వేగంగా కొట్టు కుంటోంది.

ఓ పేజీదగ్గర ఠక్కున ఆగిపోయింది. అదురు తున్న గుండెతో ఆ పేజీలో వున్న బొమ్మలని చూసింది. అక్కడి మేటర్ని చదివింది.

అంతే! ఆమె కళ్ళలోకి కాంతి వచ్చింది. చాలా రోజుల తర్వాత ఆమె మొహంలోకి కాస్త జీవకళ ప్రవేశించింది.

అది ఎవరురాశారో చూసింది. పేజీ పైవైపు రచయిత పేరూ, అడ్రస్ ఫోన్ నెంబర్‌తో సహా వున్నాయి.

ఆ రచయిత ఓ రసిక చక్రవర్తి!

అతని పేరు వింది వందన· అతని రచనల గురించీ వింది. చౌకబారు సాహిత్యాన్ని సహించలేని ఆమె అతని రచనలేం చదవలేదింతవరకూ.

కానీ ఇపుడతను రాసింది చాలా ఇంట్రస్టింగ్‌గా చదివింది. ఒకసారి కాదు పదిసార్లు!

అలా చదువుతునే పక్కమీదికొరిగింది. రాత్రి పన్నెండింటిదాకా ఆ రచన గురించే ఆలోచిస్తోంది. ఆ రచయితని కలవాలి ఎలా?

ఇలా ఆలోచిస్తున్న ఆమెకి పక్కనే వున్న బావగారి గదిలోంచి గుసగుసలు వినిపించాయి. ఒద్దను కున్నా ఆమె చెవులు వినడానికే సిద్ధమయ్యాయి.

"నువ్వెంత అందంగా వున్నావో తెలుసా?" అది ఆమె బావగారి మాట·

"ష్ పక్కగదిలో మీ మరదలుంది. ఆమె వింటే బావుండదు." అతన్ని మరింత రెచ్చగొడుతు గోముగా అంది తోటి కోడలు. అతనింకేదో పచ్చి శృంగారపు మాటలు మొదలుపెట్టాడు. అతను కావాలనే అలా బిగ్గరగా మాట్లాడుతున్నాడని పించింది వందనకి.

తర్వాత నవ్వులు, గుసగుసలు, మూలుగులు వాటికర్థం తెలియందికాదు వందనకి.

భారంగా నిట్టూర్చి, మళ్ళీ పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంది. భర్త పడుకునే స్థానంలో మెల్లిగా చెయ్యి పెట్టి నిమిరింది. ఆమె కళ్ళలోని గంగ మళ్ళీ పొంగింది.

'ఈశ్వర్! నువ్వెంత స్వార్థపరుడివి· నన్ను ఈ జనారణ్యంలో ఒంటరిగా ఒదిలేసి నువ్వెక్కడివే.. అని ఆక్రోశించిందామె హృదయం.

కాసేపు తర్వాత తేరుకుంది.

అంతటా నిశ్శబ్దంగా వుంది. బైట పడుతున్న వర్షం చప్పుడు తప్ప.

ఇంట్లోవారేకాదు వూరు వూరంతా నిద్రలో మునిగి వుంది.

ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయనికొచ్చిన వందన మెల్లగా లేచి గది తలుపులు తీసింది. అడుగులో అడుగు వేస్తున్నట్టు హాల్లోని ఫోన్ దగ్గరి కెళ్ళింది. ఓసారి పరిసరాలు పరికించి ఎవరూ చూడ్డంలేదన్న నమ్మకం కుదిరాక రిసీవర్ తీసి ఓ నెంబర్ డయల్ చేసింది.

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది ఒళ్ళంతా చిరుచమటలు పట్టాయి.

కాస్సేపు తర్వాత అవతలి వాళ్ళు రిసీవర్ తీసి "హలో!" అన్నారు నిద్ర నిండిన గొంతుతో·

"భగవాన్‌గారు...."

"నేనే ఎవరు మీరూ!" ఆవలిస్తూ అన్నాడవతలి వ్యక్తి

"నేను.... నేను వందనాదేవిని అదే చిత్రకారిణి..."

"వ్వాట్" గభాల్న లేచికూర్చున్నాడతను అతని నిద్రమత్తు పూర్తిగా ఒదిలిపోయింది.

"అవును! నేను మీతో మాట్లాడాలి!" అంది వందన·

"ప్యూర్ మా ఇంటికిరండి" అన్నాడతను.

అతనికి ఆమెని గురించి బాగా తెలుసు·ఆమె అందానికి మారుపేరని కూడా విన్నాడు. కానీ ఆమె ఎక్కడికీ వెళ్ళదెక్కువగా అందుకే ఆమెను చూళ్ళే దతను.

"ఎప్పుడురాను?"

"రేప్పొద్దున్నరండి! నేను ఫ్రీగానే వుంటాను"

"కాదు రేపు రాత్రి వస్తాను!"

"ఏవిటీ?" మరోసారి షాక్ తిన్నాడతను.

"అవును నేనక్కడికి రావడం ఎవరికీ తెలియ కూడదు. ప్లీజ్ రేపు రాత్రి పన్నెండు గంటలకొస్తాను. మీ వాళ్ళకేం అభ్యంతరం వుండదుగా!" ఆతృతగా అడిగింది వందన.

"నోనో ఏం అభ్యంతరం వుండదు అదీగాక ప్రస్తుతం నేనొక్కణ్నే వున్నాను. మీరు నిస్సంకోచంగా రావచ్చు" వుత్సాహంగా అన్నాడతను.

"ఓకే అయితే రేపు రాత్రి పన్నెండుకల్లా మీ ఇంట్లో వుంటాను. ఒకవేళ కాసేపు ఆలస్యం అయినా రాననుకోకండి అంతా నిద్రపోయాక వస్తాను."

"అలాగే అయామ్ వెయిటింగ్‌ఫర్‌యు". రిసీవర్ పెట్టేసి. ఓసారి పరిసరాలను చూసి, మొహానికి పట్టిన చెమట తుడుచుకుంటూ తన గదికేసి నడిచింది వందన.

రాత్రి పన్నెండుగంటలు కావొస్తోంది. ఎప్పుడూ లేంది ఆ రోజు అంతా పదకొండుగంటలకే నిద్ర పోయారు. వందన మెల్లగా లేచి పెరటివైపు తలుపు తీసుకుని, బైటకొచ్చి, మళ్ళీ తలుపుదగ్గరగా లాగి ఓ రిక్షా అతన్నిలేపి, రిక్షా ఎక్కి "పద" అంది. నిద్రమత్తులోవున్న అతను ఆమెని చూసి అదోలా నవ్వాడు.

"మందేవూరు బుల్లా?" అన్నాడు రిక్షా తొక్కు తూనే, "నోరు మూసుకుని పద" కఠినంగా అందామె. ఏవనుకున్నాడో మరి మాట్లాడలేదతను.

రిక్షా గమ్యం చేరింది. రిక్షా అతనికి డబ్బిచ్చి పంపేసి, తలమీద కొంగు మరికాస్త ముందుకి లాక్కుని ఓ ఇంటి తలుపు తట్టింది. వెంటనే తలుపులు తెరుచుకున్నాయి.

రచయిత భగవాన్ హాల్లో టేబిల్ ముందు కూర్చుని మందు సేవిస్తున్నాడు, ఆమెనాహ్వానిస్తూ,

"ప్లీజ్! కమిన్ నిజంగా ఇవాళ ఎంత మంచి రోజు మీలాటి అందాలరాశి....

"అందాలరాశికాదు. చిత్రకారిణి అనండి" అందామె·

"పోనీ అలాగే అనుకోండి మీలాంటి గొప్ప చిత్ర కారిణి నన్ను వెతుక్కుంటూ వచ్చిదంటే...." తలుపు మూస్తూ అన్నాడతను. అప్పటికే అతను బాగా తాగుతున్నాడు.

"కూర్చోండి" అన్నాడు.

ఆమె కూర్చుంది అతను తలుపు మయ్యడాన్ని గానీ తాగడాన్నిగానీ ఆమె పట్టించుకోలేదు.

"పాపం మీవారు"

"నేను మీసానుభూతికోసం రాలేదు సాయంకోసం వచ్చాను" అతని మాటలకడ్డొస్తూ అందామె.

"ష్యూర్! ష్యూర్ చెప్పండి వాట్ కెనైడూ ఫర్‌యూ" అన్నాడతను తన్మయత్వంగా ఆమె కళ్ళలోకి చూస్తూ క్షణం ఆమె మాట్లాడలేదు.

"సారీ! మీకేం ఆఫర్ చెయ్యలేదు. మీరేం తీసు కుంటారు మరోపెగ్ గ్లాస్‌లో పోసుకుని పెదవుల దగ్గరకి తీసుకుంటూ అన్నాడతను.

"నో థాంక్స్!"

"చెప్పండి మీరేం సంకోచించాల్సిన పనిలేదు. ఇంత ఇంటిలో మనిద్దరం తప్ప ఇంకెవరూ లేరు. భార్యబిడ్డలు వూరెళ్ళారు" అన్నాడతను ఆతృతగా.

"నాకు మీరు కావాలి మీ పొందుకావాలి! తన కౌగిలిలో కరగాలి. ఎన్నాళ్ళగానో అణుచుకున్న నా కోరిక తీరాలి. అంటుందని ఆశించిన భగవాన్ ఆమె అడిగినదానికి ఒక్కసారిగా, ఆకాశంలో విహరిస్తూ రెక్కలు తెగి భూమ్మీదపడ్డ అనుభూతి చెందాడు.

"మీరిందుకా వచ్చింది" అన్నాడు. మత్తుకాస్త దిగిందతనికి.

"అవును ఆత్మలతో సంభాషించచ్చు" అన్న వ్యాసం చదివాను. అదే నిజమైతే నేను మావారితో మాట్లాడాలి దానికి మీ సహాయం కావాలి" పసి పిల్లలా అడిగింది వందన. నీరునిండిన కళ్ళతో జాలిగా చూస్తూ

అతను పెద్దగా నవ్వాడు

ఆమె బిత్తరపోయింది.

"ఓ గొప్ప చిత్రకారిణి మీరు మీరు నమ్మారా?" అన్నాడు చాలా తేలిగ్గా.

"అంటే?"

"ఆత్మలా నా మొహమా! ఆదంతా పాఠకుల్ని ఆకర్షించేందుకు చేసే జిమ్మిక్స్!" మళ్ళీ నవ్వాడతను ఆమె నిశ్చేష్టురాలయింది.

"అయితే అవన్నీ అబద్ధాలేనా! ఆత్మలు లేనే లేవా!" వుద్వేగంగా అంది·

"ఆత్మలున్నాయో లేదో నాకు తెలియదుగానీ నేను ఏం రాసినా పాఠకులు చదువుతారు. ఇదీ సంభవమా అసంభవమా అని ఆలోచించరు. చదువు కున్నవాళ్ళు సైతం చదువుతారు. ఆత్మల గురించి

ఆలోచిస్తారు. అదే మీలాగే"

"అంటే మీరాతలతో అమాయకుల్ని మోసం చేస్తున్నారన్నమాట" తీక్షణంగా అందామె.

"ఇందులో మోసం ఏం వుంది. నాకు తోచింది. నేను రాశాను ఇష్టం వున్నవాళ్ళు చదువుతారు లేనివాళ్ళులేదు. అయినా ఈ ఆత్మలూ గోల ఎందుకు చెప్పండి ఆత్మలున్నది నిజమో అబద్ధమో నాకు తెలియదుగానీ, అర్ధరాత్రి ఓ అందాలరాశి నా ఎదురుగా ఉన్నది మాత్రం సత్యం రండి మీకోరికతీర్చే మీవారు లేరు" అన్నాడతను.

ఆమె విదిలించుకుంది - ఇద్దరిమధ్య కొన్ని క్షణాలపాటు పెనుగులాట సాగింది. చివరికి వందన గెల్చింది. బాగా తాగి వుండడంవల్ల కావచ్చు. ఆమె విసురుగా తోసేసరికి అంతదూరానికివెళ్ళి పడ్డాడు.

లేచిరాబోయడామేదగ్గరికి అయితే ఆమె వూరుకోలేదు. అతని నెత్తిమీద బలంగా కొట్టి వీధికేసి పరిగెత్తింది.

తెల్లవారింది.

ఏడుగంటలయినా వందన గది తలుపులు తెరుచుకోలేదు.

"ఈ మహారాణి ఇంకా లేవలేదా?" అని తిట్టుకుంటూ ఆమె గది తలుపు తట్టింది అత్తగారు.

అయినా అవి తెరుచుకోలేదు.

"ఏం నిద్రో అంటూ కిటికీలోంచి లోపలి దృశ్యం చూసి కెవ్వున అరిచింది

ఆమె అరుపుకి ఇంట్లోనివాళ్ళంతా కంగారుగా అక్కడికొచ్చారు ఏవిటంటూ అత్తగారు చెప్పడంతో కిటికీలోంచి చూసిన అందరూ బిగుసుకుపోయారో క్షణం. తర్వాత తలుపులు పగులగొట్టారు.

గది మధ్యగా వున్న సీలింగ్‌ఫేన్‌కి చీరతో వురి వేసుకుని వేలాడుతోంది వందన శవం!

ఒణికిపోయారంతా

ఎవరికీ దుఃఖంరాలేదు. కానీ భయం.పోలీసులు, అరదండాలు కళ్ళముందు నిల్చాయి

"ముందా వురిని తప్పించండిరా" తేరుకున్న అత్తగారు అంది. బతికుండగా ఎలగైనా ఆమెని తాకాలని ప్రయత్నించిన వందన బావగారు శవమైన ఆమె శరీరాన్ని భయంభయంగా కిందికి దింపాడు.

మామగారు చీరా అదీ దాచేశారు.

వందన ఆత్మహత్య చేసుకున్న జాడలేం కనిపించకుండా కథ అల్లి రాగం మొదలుపెట్టారు.

అలా ఏడుస్తునే ఓ మూలగా నిలబెట్టివున్న స్టాండ్‌ని చూసి ప్రతిమల్లా అయిపోయారు. వారి నోటినించి ఎలాంటి శబ్దమూ రాలేదు.

కారణం ఆ స్టాండ్‌కి అమర్చిన కేన్వాస్‌మీద చిత్రించిన చిత్రమే!

అలాంటి అద్భుతమైన చిత్రం వందన అంతకు ముందెప్పుడూ వెయ్యలేదు.

ఆకాశంలోని మబ్బుల్లోంచి ఒంగి తన భర్త తన కోసం చేతులు చాస్తే కిందినించి తానూ పైకెగురుతూ అతని చేతులు పట్టుకున్నట్టున్న చిత్రమది.


అంటే భర్త పిలుపు అందుకుని అతని దగ్గరికి చేరుకున్నానన్న సందేశం అది

ఆ చిత్రంలో వందన, ఈశ్వరులు సజీవమూర్తుల్లా వున్నారు. ఆ చిత్రం ఏపోటీలోనైనా పెడితే మంచి చిత్రంగా అవార్డురావచ్చు. అంత బావుందా చిత్రం!

ఆమె ఆత్మహత్య ఎందుకు చేసుకుందో ఎవరికీ అర్థంకాలేదు. ఎంత ఆలోచించినా. అంతేకాదు తల పగిలి హాస్పటల్లో వున్న సరసప్రియ రచయిత భగవాన్ తలని, ఎవరు పగలగొట్టారో కూడా ఎవరికీ తెలియదు ఒక్క భగవాన్‌కి తప్ప.

## 'రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఇరవై లక్షలమంది స్త్రీలు పోటీ'

మార్గరెట్ ఆల్వా



ఆంధ్రప్రదేశ్‌లో మూడు కుటుంబ న్యాయస్థానాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర పర్సనల్ అండ్ పబ్లిక్ గ్రీవెన్సెస్ పెన్షన్లశాఖ మంత్రి శ్రీమతి మార్గరెట్ ఆల్వా ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి తనకు ఈ విషయం తెలియచేసినట్లు ఆమె పేర్కొన్నారు. "మహిళలు - సాంఘిక సమస్యలు" అనే అంశంపై విజయవాడ వాసవ్య మహిళామండలి నిర్వహించిన సెమినార్‌ను కేంద్రమంత్రి ప్రారంభిస్తూ పైవిషయం వెల్లడించారు. మతంపేరిట మహిళలు సాంఘిక దురాచాలకు వివక్షతకు గురవుతున్నారని ఈ సాంఘిక సమస్యల పరిష్కారానికి స్త్రీ పురుషులమధ్య పరస్పర సహకారం అవసరమని, ఇది గ్రామీణ స్థాయినుండే ప్రారంభం కావాలని శ్రీమతి ఆల్వా పేర్కొన్నారు. సమానత్వ సాధనకు వివక్షత నిర్మూలనకు ఈ దేశంలో ఉమ్మడి పౌరసత్వ చట్టం అవసరం ఎంతైనా ఉన్నదని ఆమె నొక్కి చెప్పారు. అనేక సందర్భాలలో స్త్రీకి స్త్రీయే శత్రువుగా పరిణమిస్తున్నదని మంత్రి అన్నారు. స్త్రీలు తమ ఇళ్ళల్లో కోడళ్ళను వేధించడం మానుకోవాలని, అదే విధంగా కుమార్తెలపట్ల విద్యా విషయంలో వివక్షత చూపటం కూడా మానివేయాలని చెప్పారు. యువతులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నించాలన్నారు. సతీ సహగమనం రద్దు ఉత్తర్వులు కఠినంగా అమలు చేయాలని తాను పార్లమెంటులో గట్టిగా వాదించానని అయితే దురదృష్టవశాత్తూ తన వాదనను తమ పార్టీలోనే కొందరు వ్యతిరేకించారని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్రంలో సారా వ్యతిరేక పోరాటాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు మహిళాలోకాన్ని ఆమె అభినందించారు.

స్థానిక సమస్యల పరిష్కారంలో మహిళలకు ప్రాధాన్యత వుండాలని అన్నారు. ఎన్నికైన పాలకులు సక్రమంగా పరిపాలన సాగించడానికి, సక్రమ పరిపాలన పొందేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు శిక్షణాశిబిరాలు నిర్వహించాలని ఆమె అన్నారు.

పరిపాలన విభాగంలో సైతం 18-25 ఏళ్ళ వయసుగల మహిళలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని యోచిస్తున్నట్లు కేంద్రమంత్రి శ్రీమతి మార్గరెట్ ఆల్వా తెలిపారు.

—ఎమ్. సత్తిరెడ్డి